మహిళలకు 15 లక్షల రుణం ఇవ్వాలి

- కార్పొరేట్లకు రూ.16.5 లక్షల కోట్లు బీజేపీ మాఫీ
- మహిళలకు రుణాలు ఇవ్వడానికి మాత్రం మనసు రావడం లేదు?
- పెరిగిన గ్యాస్ ధరలతో మహిళలపై గుదిబండ
- అబద్ధాలతో కాంగ్రెస్ మభ్యపెట్టే ప్రయత్నం
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఫైర్

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): మహిళలకు స్వావలంబన కల్పించడానికి మోదీ సర్కారు చర్యలు తీసుకోవడం లేదని.. మహిళా సంఘాలకు కేంద్రం రూ.15 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కార్పొరేట్ కంపెనీలకు రూ.16.5 లక్షల మేర రుణమాఫీ చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి.. మహిళలకు రుణం ఇవ్వడానికి మాత్రం మనసు రావడం లేదని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాయ మాటలు చెబుతూ మహిళలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. బుధవారం తెలంగాణ మహిళా సాధికారత సమాఖ్య సభ్యులు ఎమ్మెల్సీ కవితను తన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో ఎప్పుడూ తాము అబద్ధాలు చెప్పలేదని పేర్కొన్నారు. మహిళా సంఘాలకు రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామని చెప్పామని.. కానీ, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రూ.20 లక్షల వరకు వడ్డీ లేని రుణం ఇస్తున్నట్టు అబద్ధాలు చెబుతున్నదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రూ.5 లక్షల మేరనే వడ్డీ లేని రుణాలు ఇస్తున్నదని, కానీ అబద్ధాలు చెప్పి మహిళలను మభ్యపెడుతున్నదని ధ్వజమెత్తారు. ప్రతీ చిన్న పనికి నిధులు ఇచ్చే కేంద్రప్రభుత్వం మహిళలకు మాత్రం ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తు తం రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణం ఇస్తున్న నేపథ్యంలో కేంద్రం రూ.15 లక్షల వరకు వడ్డీ లేని రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్యాంకులకు రుణాలు ఎగవేసి లూటీ చేసే బడా వ్యాపారవేత్తలకు రూ.16.5 లక్షల కోట్ల మేర రుణాలను కేంద్రప్రభుత్వం మాఫీ చేసిందని అన్నారు. మహిళల సంక్షేమాన్ని విస్మరించిన బీజేపీ ప్రభుత్వం.. గ్యాస్ ధరను రూ.50 పెంచి గుదిబండను మోపిందని మండిపడ్డారు. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గుతుంటే.. దేశంలో పెంచడమేంటని నిలదీశారు. ఎందుకు పెంచుతున్నారని ప్రశ్నిస్తే.. 'ప్రధాని మోదీ ఇంత గొప్పోడు, అంత గొప్పోడు' అని బీజేపీ నాయకులు అంటున్నారని ఎద్దేవా చేశారు.

మలిదశ బీసీ పోరుకు సిద్ధం

- సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఉద్యమం
- ఆందోళనలు, సభలకు తెలంగాణ బీసీ జేఏసీ పిలుపు

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): సామాజిక న్యాయం, సమానత్వం కోసం త్వరలోనే మలిదశ బీసీ ఉద్యమాన్ని చేపట్టనున్నామని, అందులో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని తెలంగాణ బీసీ జేఏసీ పిలుపునిచ్చింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. దశాబ్దాలుగా వెనుకబడిన తరగతుల ప్రజలు రాజకీయంగా, ఆర్థికంగా, విద్యాపరంగా తీవ్రమైన అన్యాయాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేసింది. రాజకీయ అవకాశాల్లో సరైన ప్రాతినిధ్యం లభించడంలేదని పేర్కొంది. త్వరలోనే ప్రతీజిల్లాలో బీసీ సంఘాలు, ప్రజలతో సమావేశాలను నిర్వహించనున్నట్టు తెలిపింది. చైతన్య ర్యాలీలను నిర్వహించి, బీసీలను చైతన్య పర్చాలని నిర్ణయించినట్టు జేఏసీ వెల్లడించింది. జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు, కన్వీనర్లు, నియోజకవర్గ బాధ్యులను నియమించి, సంస్థాగత నిర్మాణం చేపడుతామని తెలిపింది.

నిధులు ఢిల్లీకి .. నీళ్లు ఆంధ్రాకు!

- ఏపీ చేతుల్లోకి నాగార్జునసాగర్ ప్రాజెక్టు
- మోహరించిన సీఆర్‌పీఎఫ్ బలగాలు
- చోద్యం చేస్తున్న రేవంత్‌రెడ్డి సర్కారు
- రాష్ట్రంలో చంద్రబాబు పరోక్ష పాలన
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): 'తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు చేసిన హెచ్చరికలు ఒక్కొక్కటిగా నిజమవుతున్నాయి. అందులో భాగంగా ఢిల్లీకి నిధులు పంపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఆంధ్రాకు నీళ్లను యథేచ్ఛగా పారిస్తున్నది' అని బీఆర్ఎస్ మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సాగర్ డ్యామ్‌పై 2023 నాటి స్థితిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. సాగర్‌ను ఆంధ్ర బలగాలకు అప్పగించే ప్రక్రియను ఆపాలని డిమాండ్ చేశారు. నిర్ణయం మార్చుకోకపోతే రైతులు ఎక్కడికక్కడే ఆందోళనకు దిగుతారని హెచ్చరించారు. ఏపీ సీఎం చంద్రబాబు చేయాలనుకున్న నీళ్ల దోపిడీ చేస్తున్నారని, అందుకే సాగర్ ప్రాజెక్టుపై ములుగుకు చెందిన సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ స్థానంలో విశాఖకు చెందిన సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ వచ్చిందని తెలిపారు. దీంతో ఇప్పుడు సాగర్ ప్రాజెక్టు పూర్తిగా చంద్రబాబు చేతిలోకి వెళ్లిందని, కేసీఆర్ సీఎంగా ఉన్నన్ని రోజులు సీఆర్‌పీఎఫ్ బలగాలను సాగర్‌కు రానివ్వనేలేదని గుర్తుచేశారు. సీఆర్‌పీఎఫ్‌కు సాగర్‌ను అప్పజెప్పడం అంటే తెలంగాణ చేతి నుంచి ఆంధ్రా చేతికి ఆ ప్రాజెక్టు బాధ్యతలను అప్పగించడమేనని ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో మళ్లీ సమైక్య పాలన రోజులు వస్తున్నాయని, రాష్ట్రంలో ఏపీ సీఎం చంద్రబాబు పాలన కొనసాగుతున్నదని దుయ్యబట్టారు. తెలంగాణలో కేసీఆర్ పథకాలు వెనక్కి పోతున్నాయని, నదీజలాల్లో రాష్ట్ర హక్కులు సైతం హరించుకుపోతున్నాయని నిప్పులు చెరిగారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో కృష్ణా, గోదావరి జలాల్లో మన వాటాను పూర్తిగా వినియోగించుకుంటే, ఈ కాంగ్రెస్ పాలనలో ఏపీ సీఎం చంద్రబాబు నీళ్లను అక్రమంగా మళ్లిస్తుంటే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

కాంగ్రెస్‌ది వితండవాదం

కేసీఆర్ కృష్ణా ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి తాకట్టుపెట్టే ప్రయత్నం చేశారని కాంగ్రెస్ వితండవాదం చేస్తే, అక్కడ లక్ష మందితో కేసీఆర్ సభ పెట్టడంతో కాంగ్రెస్ ప్రభుత్వం తోక ముడిచిందని జగదీశ్‌రెడ్డి తెలిపారు. ఆ తర్వాత కృష్ణా ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగించేది లేదని అసెంబ్లీలో తీర్మానం చేసిందన్న విషయాన్ని గుర్తుచేశారు. అయినా కాంగ్రెస్ తీరు మారలేదని విమర్శించారు. ఏపీ సీఎం చంద్రబాబు అంటే ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు వణుకుతున్నదో అర్థంకావడం లేదని తెలిపారు. చంద్రబాబు ద్వారా ప్రధాని మోదీకి ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం దగ్గరైందని విమర్శించారు. సాగునీటిపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఏ మాత్రం సోయి లేదని ధ్వజమెత్తారు.

మరో ప్రజాపోరాటం తప్పదు?

తెలంగాణలో మరో ప్రజాపోరాటం తప్పదని జగదీశ్‌రెడ్డి స్పష్టంచేశారు. నీళ్లు, నిధులు లేక ఉమ్మడి పాలన నాటి పరిస్థితులు ఇక్కడ మళ్లీ దాపురించాయని ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో మన నీటి వాటాలు మనకు రావాలని, ప్రాజెక్టులపై మన నియంత్రణ ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేవలం రాజకీయ అవసరాల కోసమే తెలంగాణ హక్కులను ఏపీకి తాకట్టు పెడుతున్నారని ధ్వజమెత్తారు. ఒక్క తప్పుకు వంద అబద్ధాలు అన్నట్టుగా హెచ్‌సీయూ భూములపై సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని విమర్శించారు. సమావేశంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఒంటెద్దు నరసింహారెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిశోర్‌గౌడ్, బీఆర్ఎస్వీ ఉపాధ్యక్షుడు తుంగబాలు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తాగునీటి కటకట

వర్షాలు రావడం ఆలస్యమైతే రానున్న రోజుల్లో హైదరాబాద్ తాగునీటికి కటకట ఏర్పడుతుందని జగదీశ్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. కేసీఆర్ పాలనలో ఏటా రెండు పంటలకు నీళ్లందించామని, కానీ, ఇప్పుడు కనీసం తాగునీళ్లు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సాగునీళ్ల మంత్రి కాదని, ఆయన కన్నీళ్ల మంత్రి అని ఎద్దేవా చేశారు. స్వయంగా నీళ్ల మంత్రి నియోజకవర్గంలోనే సాగునీళ్లు లేక రైతులు కంటతడి పెడుతున్నారని తెలిపారు.

ఇందిరమ్మ రాజ్యమంటే ఇంటింటిపై కేసులా?

- పింక్‌బుక్‌లో కాంగ్రెస్ అరాచకాలు
- నాడు కేసీఆర్ జనహిత పాలన
- నియంతగా పాలిస్తున్న రేవంత్‌రెడ్డి
- ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ రాజ్యమంటే ఇంటింటిపైనా కేసులు పెట్టడమా? అని బీఆర్ఎస్ ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ రాజ్యాంగం పోయి, ఇందిరమ్మ రాజ్యాంగం వచ్చిందా? అని నిలదీశారు. జై తెలంగాణ అంటే జైల్లో పెడుతున్నారని, నిజం చెప్తే నిర్బంధిస్తున్నారని, మొత్తంగా రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికే బీఆర్ఎస్ కీలక నేతలైన కేటీఆర్, హరీశ్‌రావు సహా ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, నేతలు కొణతం దిలీప్, క్రిశాంక్ తదితరులు ఎందరిపైనో కేసులు పెట్టారని తెలిపారు. 60 లక్షలకు పైగా ఉన్న బీఆర్ఎస్ సైన్యాన్ని జైళ్లో పెట్టగలరా? అని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలపై కేసులు పెట్టాలని పోలీసులకు టార్గెట్లు పెడుతున్నారని, కేసులు పెట్టని పోలీసు అధికారులను వేధిస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో ఇదే విధంగా కేసులు పెట్టి ఉంటే, కాంగ్రెస్ పార్టీ ఉండేదే కాదని చెప్పారు. దీనిపై మేధావులు స్పందించాల్సిన అవసరం వచ్చిందని, లేదంటే రాష్ట్రం ప్రమాదంలో పడే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు.

షాడో సీఎంగా మీనాక్షి నటరాజన్

రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ షాడో సీఎంగా రాష్ట్ర సచివాలయంలో వ్యవహారాలు చక్కపెడుతుంటే.. డమ్మీ సీఎంగా రేవంత్‌రెడ్డి మాత్రం కమాండ్ కంట్రోల్ నుంచి పాలన చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణను కేసీఆర్ ఒక బ్రాండ్‌గా మారిస్తే, సీఎం రేవంత్ మాత్రం కేసుల తెలంగాణగా మార్చారని ధ్వజమెత్తారు. బీజేపీకి సీఎం రేవంత్‌రెడ్డి కోవర్టు అని ఆరోపించారు. రాష్ట్రంలో నాడు కేసీఆర్ జనహిత పాలన అందిస్తే.. సీఎం రేవంత్‌రెడ్డి నియంత పాలన చేస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి అరాచకాలను పింక్‌బుక్‌లో నమోదు చేసుకుంటున్నామని హెచ్చరించారు.

మాట్లాడుతున్న గట్టు రామచందర్‌రావు తదితరులు

పూలే విగ్రహ ఏర్పాటుపై ప్రకటన చేయాలి

బీఆర్ఎస్ నేత గట్టు రామచందర్‌రావు డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తారా? లేదా? అని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత గట్టు రామచందర్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈనెల 11న పూలే జయంతి ఉందని.. ఈలోగా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణభవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన దీక్ష జయప్రదం కావడంతో సీఎం రేవంత్‌రెడ్డి బ్యాచ్‌కి కళ్లు కుట్టాయని ఆయన విమర్శించారు. ఇందిరాపార్కు వద్ద దీక్ష స్థలాన్ని కొందరు పినాయిల్‌తో కడిగారని.. అలా చేయడం పూలేను అవమానించడమే అవుతుందని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ పూలేకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సెక్యూరిటీలు లేకుండా గ్రామాలకు వెళితే.. ప్రజలు నిలదీసేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. బీసీలను మోసం చేయటానికే ఢిల్లీలో రేవంత్‌రెడ్డి దొంగ దీక్షలు చేశారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందిందని విమర్శించారు. పూలే విగ్రహం ఏర్పాటు కోసం ఎమ్మెల్సీ కవిత పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. బీసీల అభివృద్ధి కోసం మాజీ సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. ట్యాంక్‌బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. ఈ సమావేశంలో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిశోర్‌గౌడ్, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రాఆనంద్, జాగృతి నాయకులు ఆలకుంట హరి, నరేశ్ పాల్గొన్నారు.

అగ్రో మార్కెట్లలో కూరగాయలు, పండ్లు

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో కూరగాయలు, పండ్లు, పూలు కూడా విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలి విడతలో మహబూబ్‌నగర్, నల్లగొండ, వరంగల్, నిజామాబాద్ జిల్లా కేంద్రాల్లోని యార్డుల్లో కూరగాయలు, పండ్లు, పూలవిక్రయాన్ని ప్రారంభించనుంది.

ఇంజినీర్లకు పదోన్నతులు

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రోడ్లు-భవనాల శాఖలో ఇంజినీర్లకు ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. 2024-25 ప్యానల్ సంవత్సరంలో 101 మంది అసిస్టెంట్ ఇంజినీర్లకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా, 22మంది ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు పదోన్నతి కల్పించింది. వీరిలో ఆర్ రామచంద్రశేఖర్‌కు ఇన్‌చార్జి డిప్యూటీ చీఫ్ ఇంజినీర్‌గా, మరో 21మందికి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఇంజినీర్లుగా పదోన్నతులు కల్పించి పోస్టింగ్‌లు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

తెలంగాణకే రొనాల్డ్‌రాస్

ఉత్తర్వులు జారీచేసిన క్యాట్

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): సీనియర్ ఐఏఎస్ అధికారి రొనాల్డ్‌రాస్‌కు క్యాట్‌లో ఊరట లభించింది. ఈమేరకు ఆయన తెలంగాణలోనే కొనసాగేలా క్యాట్ ఉత్తర్వులు జారీ చేసింది. రొనాల్డ్‌రాస్‌ను తెలంగాణలోనే కొనసాగించాలని డీవోపీటీని క్యాట్ ఆదేశించింది. ఉద్యోగుల విభజన సందర్భంగా రొనాల్డ్‌రాస్‌ను డీవోపీటీ ఏపీకి కేటాయించింది. దీంతో ఆయన క్యాట్‌ను ఆశ్రయించి దాదాపు పందేడ్లపాటు తెలంగాణలోనే విధులు నిర్వహించారు. నిరుడు డీవోపీటీ తిరిగి కొంత మంది ఐఏఎస్‌లను ఏపీకి కేటాయించింది. డీవోపీటీ ఆదేశాల మేరకు రొనాల్డ్‌రాస్ ఏపీలో రిపోర్టు చేశారు. ఏపీలో రిపోర్టు చేశాక మరోసారి క్యాట్‌ను ఆశ్రయించి.. తనను తెలంగాణలోనే కొనసాగించాలని కోరారు. రొనాల్డ్‌రాస్ పిటిషన్‌పై విచారించిన క్యాట్.. ఆయనకు అనుకూలంగా బుధవారం ఆదేశాలు జారీచేసింది. మరో ఐఏఎస్ అధికారి శివశంకర్ విషయంలో నాలుగు వారాల్లోగా డీవోపీటీ ఉత్తర్వులు జారీ చేయాలని క్యాట్ ఆదేశించింది.

కేసీఆర్ పట్టాలిస్తే.. కాంగ్రెస్ అడ్డుకుంటుంది

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- పలుచోట్ల బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

చింతలమానేపల్లి/కాగజ్‌నగర్/కౌటాల, ఏప్రిల్ 9 : కాంగ్రెస్ సర్కార్ రైతులను వేధిస్తున్నదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. కేసీఆర్ సర్కారు పోడు భూములకు పట్టాలిస్తే.. వాటిలో సాగు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకోవడం దారుణమని అన్నారు. బుధవారం ఆయన కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం కర్జెల్లి, గంగాపూర్, బూరెపల్లి, సిర్పూర్(టీ) మండలం డొర్పల్లి, కౌటాల మండలం పార్డీ గ్రామాల్లో పర్యటించారు. పలుచోట్ల రైతులు, బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్థులతో సమావేశమయ్యారు. కర్జెల్లి, గంగాపూర్, దిందా, కేతిని, గూడెం, కోర్సిని తదితర గ్రామాల్లో పట్టా భూముల్లో వ్యవసాయ పనులకు వెళ్తే నోటీసులు ఇస్తామంటూ అటవీ అధికారులు బెదిరిస్తున్నారని రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన పోడు పట్టా భూముల్లో సైతం వ్యవసాయం చేసుకోకుండా అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులు భయాందోళనలు చెందొవద్దని, బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ భరోసా ఇచ్చారు. అటవీ శాఖ అధికారులు రైతులను ఇబ్బందులు పెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు. కాగా కర్జెల్లిలో కాంగ్రెస్, బీజేపీకి చెందిన 50 మంది, డొర్పల్లిలో కాంగ్రెస్ నాయకుడు దుర్గం మధుకర్, పార్డీ గ్రామంలో 10 మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా.. ఆయన వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరిన కర్జెల్లి గ్రామస్థులు

కడియం సవాల్‌కు రాజయ్య సై

- భూముల కబ్జాపై చర్చించేందుకు రెడీ.. టైమ్ చెప్పు!
- మాజీ ఎమ్మెల్యే తాటికొండ

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

స్టేషన్ ఘన్‌పూర్, ఏప్రిల్ 9 : కడియం శ్రీహరి సవాల్‌కు మాజీ ఎమ్మెల్యే రాజయ్య సై అన్నారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారం, దేవునూరు గ్రామాల్లోని అటవీ భూములను ఎమ్మెల్యే శ్రీహరి, తన కూతురు, అల్లుడు బినామీల పేర్లతో అక్రమంగా దోచుకునేందుకు యత్నిస్తున్నారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఆరోపించిన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన కడియం శ్రీహరి భూములను కబ్జా చేసినట్టు నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేయడమే కాకుండా పల్లా, రాజయ్య వద్ద గులాంగిరీ చేస్తానని, లేకుంటే వారు చేయాలని సవాల్ విసిరారు. దీనికి మాజీ ఎమ్మెల్యే రాజయ్య స్పందించి బుధవారం స్టేషన్ ఘన్‌పూర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడియం విసిరిన సవాల్‌ను స్వీకరిస్తున్నానని, ముహూర్తాల పిచ్చి ఉన్న కడియం తేదీ, సమయం, స్థల ముహూర్తాన్ని నిర్ణయించాలని సూచించారు. కడియంపై చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని స్పష్టంచేశారు. రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులతోపాటు వారికి సహకరించిన పోలీస్ సిబ్బంది రావాలని, తనతోపాటు ఎమ్మెల్యే పల్లా వస్తారని చెప్పారు. అటవీ భూముల విషయం నిజనిర్ధారణ కాకముందే, సర్వే రిపోర్టు, సీసీఎఫ్ నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాకముందే బుల్డోజర్లు, జేసీబీలు తీసుకుపోయి పోలీసుల పహారాలో రెవెన్యూ అధికారులు దగ్గరుండి భూములను చదును చేయించారని ఆరోపించారు. ఈ విషయం తెలుసుకుని అక్కడి పరిస్థితిని పరిశీలించడానికి తాను వెళ్లగా 2 కిలోమీటర్ల మేర చెట్ల నరికివేత, మైనింగ్ పర్మిషన్ లేకుండానే వేల ట్రాక్టర్ల మొరం తరలింపు జరిగినట్టు గుర్తించామని చెప్పారు. 80 ఏండ్లుగా ఆ భూముల్లో సాగులేదని, ఫారెస్ట్ అధికారులు తీసిన కందకం అవతల ఈ తతంగం చేశారని చెప్పారు. ఈ ఫారెస్ట్ భూముల వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. దేవునూరు పరిసర ప్రాంతాల్లో కడియం, ఆయన కుటుంబ సభ్యులకు బినామీల పేర్లతో భూమి ఉందని, రెండేళ్ల నుంచి పాలేర్లతో సాగుచేస్తున్నట్టు ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ఆరు నెలల నుంచి ముప్పారం, నారాయణగిరిలో 23 మంది రైతుల పేర్లతో 43.38 ఎకరాల్లో పట్టాలున్నట్టు చెబుతున్నారని, అవి కూడా బినామీ పేర్లతో కడియం తీసుకున్నట్టు ఆధారాలు ఉన్నాయని స్పష్టంచేశారు. మార్చి 27న ఎలాంటి అనుమతులు లేకున్నా జేసీబీలతో ఉపాధి హామీ పథకం ద్వారా కోట్లు ఖర్చు పెట్టి పెంచిన మొక్కలను నరకడంతోపాటు, మైనింగ్ అనుమతులు లేకుండా వేల ట్రాక్టర్ల మొరాన్ని తరలించి అటవీ సంపదను ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

ఏపీ గుత్తాధిపత్యంలోకి కేఆర్ఎంబీ!

- బోర్డుపై పట్టు కోల్పోతున్న తెలంగాణ
- తెలంగాణ కోటాలో ఖాళీగా ఉన్న పోస్టులను ఆంధ్రా అధికారులతో భర్తీ చేసేందుకు బోర్డు పావులు
- తీవ్ర నష్టం తప్పదంటు హెచ్చరిస్తున్న రాష్ట్ర ఇంజినీర్లు
- ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్న రేవంత్ సర్కారు

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ)పై తెలంగాణ పట్టు కోల్పోతున్నది. ఇప్పటికే కృష్ణా జలాలను ఇష్టారాజ్యంగా తరలించుకుపోతున్న ఏపీ.. మొత్తంగా కేఆర్‌ఎంబీనే తన చెప్పుచేతల్లో పెట్టుకుని గుత్తాధిపత్యం చెలాయించబోతున్నది. అందుకు అనుకూలంగా బోర్డు సైతం పావులు కదుపుతున్నది. బోర్డులోని ఖాళీ పోస్టులన్నింటినీ ఏపీ అధికారులతో భర్తీ చేసేందుకు సన్నద్ధమవుతున్నది. వివరాల్లోకి వెళ్తే.. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మధ్య కృష్ణా, గోదావరి నదీ జలాల పంపిణీ, వివాదాల పరిష్కారానికి రివర్ బోర్డులను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ బోర్డుల్లో చైర్మన్, మెంబర్ సెక్రటరీ, ఇద్దరు మెంబర్లను కేంద్రం నియమిస్తుంది. మిగతా బోర్డు సెక్రటేరియట్‌లో ఎస్‌ఈలు, ఈఈలు, డీఈఈలు, ఏఈఈలను ఇరు రాష్ట్రాలు సమాన నిష్పత్తిలో నియమించుకుంటాయి. ప్రస్తుతం కేఆర్‌ఎంబీలో తెలంగాణకు సంబంధించిన పలు పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. ఇదే అదునుగా ఆ పోస్టులన్నింటినీ తమ అధికారులతో భర్తీచేసేందుకు ఏపీతోపాటు బోర్డు పావులు కదుపుతున్నట్టు తెలుస్తున్నది. కేఆర్‌ఎంబీలో 2 ఎస్‌ఈ (సూపరింటెండెంట్ ఇంజినీర్), 4 ఈఈ (ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్), 6 డీఈఈ (డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్), 10 ఏఈఈ (అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్) పోస్టులు కలిపి మొత్తం 22 పోస్టులున్నాయి. ఆ పోస్టులను ఇరు రాష్ట్రాల అధికారులతో సమాన నిష్పత్తిలో భర్తీ చేయాలి. ఇవి కాకుండా ఎలక్ట్రికల్ ఇంజినీర్, అకౌంట్స్ ఆఫీసర్, సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులున్నాయి. వాటిలో ఏపీకి సంబంధించిన 50% పోస్టులన్నీ ఆ రాష్ట్ర అధికారులతో భర్తీ చేశారు. ప్రస్తుతం తెలంగాణకు సంబంధించిన 50% కోటాలో చాలా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక ఈఈ పోస్టుతోపాటు 5 ఏఈఈ పోస్టుల్లో 4 ఖాళీగా ఉన్నాయి.

ఏపీ అధికారులతో భర్తీకి సన్నాహాలు

తెలంగాణ కోటాలోని పోస్టుల భర్తీ కోసం రాష్ట్ర ఇరిగేషన్ శాఖ గత మార్చి నుంచి దాదాపు 4 దఫాలుగా దరఖాస్తులను ఆహ్వానించింది. ఆ మేరకు అన్ని యూనిట్లకు సర్క్యూలర్‌ను జారీచేసినప్పటికీ డిప్యూటేషన్‌పై వెళ్లి కేఆర్‌ఎంబీలో విధులు నిర్వర్తించేందుకు రాష్ట్ర ఇరిగేషన్ ఉద్యోగులెవరూ ఆసక్తి చూపడంలేదు. త్వరలో కేఆర్‌ఎంబీని ఏపీకి తరలిస్తారనే ప్రచారం జరుగుతుండటంతో అక్కడికి వెళ్లేందుకు తెలంగాణ ఉద్యోగులెవరూ ముందుకు రావడంలేదని తెలుస్తున్నది. కేఆర్‌ఎంబీలో తెలంగాణ కోటా పోస్టులను దీర్ఘకాలం నుంచి భర్తీ చేయకపోవడంతో పరిపాలనపరమైన సాకులు చూపుతూ ఆ పోస్టులను ఏపీ అధికారులతో భర్తీ చేయాలని బోర్డు సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. అదే జరిగితే ఏఈఈ పోస్టులన్నింటిలో ఏపీ అధికారులే తిష్ట వేస్తారు. అది తెలంగాణకు చాలా ఇబ్బందికరంగా పరిణమిస్తుందని రాష్ట్ర ఇంజినీర్లు హెచ్చరిస్తున్నారు. ఈ విషయాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దీనిపై దృష్టి సారించాలని, కేఆర్‌ఎంబీలో తెలంగాణ కోటా అధికారులను త్వరగా భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

జీబీ లింక్‌పై ఏపీ దూకుడు

- ప్రాజెక్టు పనుల కోసం ప్రత్యేక కార్పొరేషన్‌కు రంగంసిద్ధం
- 'జలహారతి' పేరిట ఏర్పాటు చేస్తూ జీవో విడుదల చేసిన ఏపీ

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పునర్విభజన చట్టంలోని నిబంధనలను ఏపీ ప్రభుత్వం తుంగలో తొక్కుతున్నది. గోదావరి-బనకచర్ల (జీబీ) లింక్ ప్రాజెక్టును చేపట్టేందుకు దూకుడుగా ముందుకు సాగుతున్నది. ఆ ప్రాజెక్టు పనుల కోసం స్పెషల్ పర్పస్ వెహికిల్‌ను (ఎస్పీవీని) ఏర్పాటు చేసింది. ప్రాజెక్టు నిర్మాణానికి కావాల్సిన నిధుల సమీకరణకు 'జలహారతి' పేరిట కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. జీసీ లింక్ ప్రాజెక్టు ద్వారా గోదావరి నుంచి 200 టీఎంసీల వరద జలాలను కృష్ణా బేసిన్‌కు, అక్కడి నుంచి బనకచర్ల మీదుగా పెన్నా బేసిన్‌కు మళ్లించేందుకు ఏపీ సిద్ధమైంది. రూ.80,112 కోట్లతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నది. ఆ ప్రాజెక్టుకు ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతులివ్వకూడదని సీడబ్ల్యూసీకి, కేంద్ర జల్‌శక్తి శాఖకు ఫిర్యాదు చేయడంతోపాటు ఇటీవల గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్‌ఎంబీ) సమావేశంలోనూ బలంగా వాదనలు వినిపించింది. ట్రిబ్యునల్ అవార్డుకు విరుద్ధంగా ఈ ప్రాజెక్టును చేపట్టిన ఏపీ.. ఆ పనుల కోసం ఇప్పటికే రూ.1,000 కోట్లు ఖర్చు చేసింది. అయినప్పటికీ ఈ ప్రాజెక్టు కేవలం ప్రణాళికల దశలోనే ఉన్నదని, ఇంకా డీపీఆర్ కూడా సిద్ధం కాలేదని బుకాయిస్తున్న ఏపీ.. మరోవైపు జీసీ లింక్ పనులను వేగంగా పట్టాలెక్కిస్తున్నది. అందులో భాగంగా ఆ ప్రాజెక్టు పనుల కోసం తాజాగా జీబీ జలహారతి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది. కేవలం వరద జలాల కోసమే ఈ ఎస్పీవీని నెలకొల్పిన ఏపీ.. బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రుణాలను తీసుకునేందుకు ఆ కార్పొరేషన్‌కు అధికారాలను కట్టబెట్టింది.

హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు తప్పనిసరి

- 2019 ఏప్రిల్ 1కి ముందు రిజిస్టరైన వాహనాలన్నీ మార్చుకోవల్సిందే
- సెప్టెంబర్ 30లోగా అమర్చుకోవాలి: రవాణాశాఖ ఉత్తర్వులు

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తేతెలంగాణ): రాష్ట్రంలో 2019 ఏప్రిల్ 1కి ముందు రిజిస్టర్ అయిన వాహనాలన్నీ కచ్చితంగా హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లు(హెచ్‌ఎస్‌ఆర్‌పీ) అమర్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. సెప్టెంబర్ 30 వరకు తుది గడువు విధించింది. వాహన యజమానులు https//www.siam.in/లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. టూ వీలర్స్‌కు రూ.320 నుంచి రూ.380, త్రీవీలర్స్‌కు రూ.350 నుంచి రూ.450, ఫోర్ వీలర్స్‌కు రూ.590 నుంచి రూ.700, కమర్షియల్ వాహనాలు రూ.600 నుంచి రూ.800 వరకు చెల్లించాలని రవాణాశాఖ బుధవారం రాత్రి జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్లు లేకపోతే వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించింది.

భూదాన్ భూములపై విచారణకు కమిటీ

హైకోర్టుకు తెలిపిన ప్రభుత్వం

హైదరాబాద్, ఏప్రిల్ 9(నమస్తే తెలంగాణ): భూదాన్ భూముల అక్రమాలపై విచారణకు ముగ్గురు సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్టు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలియజేసింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలోని సర్వే నంబర్ 181, 182లో 103.22 ఎకరాల భూదాన్ భూముల అక్రమాలపై కూడా అదే కమిటీ విచారిస్తుందని చెప్పింది. కమిటీ విచారణ చేసి నివేదిక ఇవ్వడానికి మూడు వారాల సమయం పడుతుందని తెలియజేసింది. నాగారంలో 50 ఎకరాల భూదాన్ భూములకు సంబంధించి పట్టాదారు పాస్‌బుక్‌లు జారీచేసిన వ్యవహారంపై ప్రైవేటు వ్యక్తులు దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్లను యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ యారా రేణుకలతో కూడిన ధర్మాసనం బుధవారం విచారించింది. ఈ సందర్భంగా ఐఏఎస్ అధికారులు నవీన్ మిట్టల్, రఘునందన్‌రావు, శశాంక్‌లతో కమిటీ ఏర్పాటు చేసినట్టు ప్రభుత్వ న్యాయవాది చెప్పారు. తదుపరి విచారణను ఈనెల 21వ తేదీకి వాయిదా వేసింది.